కోర్కెల్ని జయించిన గొప్ప యోగిగా ప్రజలచేత ఆరాధించబడవచ్చు. కానీ. జయించరాని అంతరాత్మ వుంటుంది. కోర్కెల్ని జయించినవాడా, కోర్కెల్ని తీర్చుకోలేనివాడా అన్న సంగతి అది చెబుతుంది.

# మృగతృష్ణ

## ఆచంట ఉమాదేవి



నిర్మలంగా వున్న నీలాకాశంలోకి చూస్తూ, పిట్టగోడ నానుకుని నిలబడ్డ నిర్మల. ఆలోచనలు ఎక్కడెక్కడికో పోయాయి. తన కర్తవ్యమేదో తనకి తెలీనట్లు, తన జీవితం వ్యర్థమైపోతున్నట్లు ఎందుకనిపిస్తూ వుంటుంది తనకి ! తానొక స్త్రీ ! వివాహిత ! ప్రేమించే భర్తా, రత్నాల్లాంటి పిల్లలూ వున్నారు.... కానీ, యింకా ఏదో వెత్తి.ఏదో ఆవేదన: అసంతృప్తి.... అవును. ఈ జీవితానికి అర్థం ఏమిటో తెలీకపోతే అసంతృప్తే మిగిలేది: ఈ భవబంధాలన్నీ ఒక్కసారి తెంచేసుకొని. గాలిలో తేలిపోతూ, తిరుగుతూ, సృష్టికర్తని వెదికి పట్టుకుని సృష్టిరహస్యాలన్నీ ఛేదించాలన్న ఆరాటం కల్గుతుంది తనలో: కేవలం ఒక స్త్రీగా. భార్యగా, తల్లిగా బ్రతికేయటంతో. జీవితం సఫలం కాదు అనిపిస్తుంది. ఈ విషయం ఆయనతో అంటే. తేలికగా నవ్వేస్తారు. నీకు అన్నిటికీ అతీతంగా వుండా లనిపిస్తుందే. అదే భక్తంటే కానీ నిమిత్త భక్తికి మరొకపేరు చెప్పనా." తమపై తమకిగల అవ్యాజానురాగంతో కూడిన స్వాభిమానం. ఇంగ్లీషులో "సెల్ఫ్‌పిటీ" అంటారే, అది కట్టలు తెంచుకున్నప్పుడు. "భక్తి" అనబడుతుందట." అని నవ్వుతారు. ఆయనకితన ఆలోచనలు, ఆరాటము అర్థంకావు. జీవితం తేలికగా తీసుకుని, తేలికగా గడిపేసే మనిషి ఆయన. కానీ తను మాత్రం పైకి అందరూ, యింత సుఖంగా, సంతోషంగా కనబడుతారు కానీ, మనిషికీ. అంతరాంతరాలలో బాగా తెలుసు కాబోలు జీవితం.దుఃఖమయమని అందుకే, సుఖంకోసం అంత ఆరాటం.

"సారీ నిర్మలా ఆలస్యమైంది రావటం. రాణీగారు అలుక వహించినట్లున్నారు...." అంటూ, సమీపించాడు డాకర్ రమాకాంత్: భర్తచేయి. వెచ్చని స్పర్శ తగులగానే, నిర్మల ప్రస్తుతంలోకి వచ్చింది. అలసిపోయిన అతని ముఖం చూడగానే ఆమెలో సహజమెన జాలి, సానుభూతి కల్గాయి. "రమాకాంత్‌ని చూడగానే, నా మనసు పరవళ్ళు తొక్కి పరవశించదేం.... నేనెందుకు తృప్తిగా సంతోషంగా లేనూ. నాకేమీ తక్కువ లేదంటారందరూ మరి...." అనుకుంటూ, అతనితో కలిసి క్రిందికి వచ్చింది. అలసివచ్చే డాక్టర్‌కి. రోజూ సాయంత్రం నిర్మలతో కలిసి షికారుకో, సినిమాకో వెళ్ళడం సరదా. భర్త ఎక్కడికి రమ్మంటే అక్కడికెళ్ళటమేతప్ప. సహజమైన సరదాలు, కోరికలు లేవు నిర్మలకి. స్నానం చేసివచ్చి, కాఫీ తాగుతూ అన్నాడు రమాకాంత్.


పారడైజ్‌లో మంచి ఇంగ్లీషు పిక్చరొచ్చిందట. పోదాం పద నిమ్మీ! వంటకాలేదని వంకపెట్టకు-ఎక్కడో అక్కడ తినేద్దాం' అని. నిర్మలా, రమాకాంత్‌లకి, యిద్దరే పిల్లలు. ట్రాన్స్ఫర్లలో చదువు పాడవుతుందని, వారిని బోర్డింగ్‌లో వుంచారు.

న్యూస్‌రీల్ కూడా చూడాలన్న ఆత్రుతతో కారు స్పీడుగా పోనిస్తున్న రమాకాంత్, దార్లో జనం, చాలా మంది, కోలాహలంగా వేగంగా నడిచిపోతూండటం చూసి, "ఇంగ్లీషు సినిమాకి యింత జనం రారు కదా సాధారణంగా! మరి వీళ్ళు ఎక్కడికి వెళ్తున్నట్టు?" అనుకుంటూండగానే. అతి దగ్గరలోనించే, ఎవరిదో శ్రావ్యమైన గొంతు, మైక్ ద్వారా వినబడి తల తిప్పి రోడ్డు పక్కకి చూశాడు. ఒక ఖాళీస్థలంలో. పెద్ద షామియానా! జనం విరగబడివస్తూ పోతూ హడావిడిగా కనబడ్డారు. ఆ వినబడుతున్న శ్లోకం, భగవద్గీతలోనిది అని గుర్తుపట్టిన నిర్మల, వెంటనే స్టీరింగ్ మీద చేయివేసింది. కారు ఆగింది. నిర్మల రమాకాంత్ కారుదిగి "గీతజ్ఞాన యజ్ఞ" అని బోర్డువున్న షామియానా దగ్గరగా వచ్చి నిలబడ్డారు.

"ఏమంటారు? పిక్చర్‌కి వెళ్దామా లేక...." నిర్మలకి మనసులో, లోపలికెళ్ళి ఆ వుపన్యాసం వినాలనివుందని కనిపెట్టిన రమాకాంత్ "పద లోపలికి వెళ్దాం అదుగో మా డాక్టర్లు, క్లబ్బు స్నేహితులూ ఎంతోమంది వస్తున్నారు" అంటూ లోనికి దారితీశాడు.

గొప్ప, బీద, తారతమ్యం లేకుండా అందరూ నేలమీద పరచివున్న దర్రీమీద కూర్చుని, స్వామీజీ చదివిన శ్లోకాన్ని. ఆయన వెంటే చదువుతున్నారు. నిర్మల కూడా సర్వస్వం మరిచిపోయి, శ్లోకాలని వింటోంది. స్వామీజీ వివరించే అర్థం గ్రహించలేని కొందరు శ్రోతలు గుసగుసగా మాట్లాడుకోసాగారు.

"ఈయనకి పెళ్ళి కాలేదుట. బాగా చదువుకున్నవాడు వున్నత కుటుంబానికి చెందినవాడట. బాగా ఆస్తి కూడా వుండేదట. ఎంత వైరాగ్యం లేకపోతే. యిలా అన్నీత్యాగం చేయగల్గాడో! అనాధ స్త్రీలనూ, పసిపిల్లలనూ, వందలకొలదిని పోషించాడుట. పాపం.. జీవితంలో, ఏ దుర్ఘటన, అతనికీ వైరాగ్యాన్ని కల్గించిందో.... అంటున్నారెవరో. నిర్మల కూడా ఇలాంటి మనుష్ని గురించి ఆలోచిస్తూంటుంది ఎన్నోసార్లు! అలా వుండాలనిపించటం సహజంమేనేమో కానీ,




ఉండగల్గడం తేలిక, సహజమూ మాత్రం కాదు. ఈ వయసులో వివాహము, సుఖాలు లేకుండా, ఈయన ఇదంతా విరక్తి. భక్తియేనా....లేక.... ఒక వృత్తేనా.... మనిషి గడ్డం, మీసం పెంచాడు. కాషాయ వస్త్రాలు ధరించివున్నాడు. కానీ, ఆ జుట్టు, శరీరం శ్రద్ధగా పోషింపబడినట్లు నిగనిగలాడుతున్నాయి. ముఖంలో ఆరోగ్యం, కళ వున్నాయి ఆదేశిస్తున్నదీ ఈ మనిషి తాను ఉపదేశిస్తున్నదీ తనుకూడా ఆచరిస్తూ వుండి వుంటాడా.. సర్వస్వాన్నీ త్యజించి ఏ వికారమూ చెందకుండా. తపోభంగం కాకుండా...." నిర్మల ఆలోచనలకి. శ్రోతల నవ్వు అంతరాయం కల్గించింది.

"ఎందుకలా నవ్వుతున్నారు? స్వామిజీ ఏమన్నారు" అనుకుంటూ తల ఎత్తి. వేదికపై కూర్చున్న స్వామీజీని చూసింది నిర్మల....ఆయనా నవ్వుతున్నారు. "ఇంత మందిని నవ్వించగల్గాను" అన్న గర్వమేదో ఆయన ముఖంలో కనబడింది నిర్మలకి. ఆయన ముఖాన్ని కుతూహలంగా పరీక్షిస్తున్న నిర్మల హఠాత్తుగా ఉలిక్కిపడింది. 'ఆ నవ్వు....యీయన... యితను....రాజు కాదుకదా....అవును అలా కళ్ళు మూసుకుని నవ్వేది, అరె .... రాజు కాక పోవటమేమిటి.... రాజే సందేహం లేదు.' నిర్మల గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి "నువ్వు యింకా యిలాగే వున్నావా రాజూ—ఆనాటి నీమాటలు నిజమే నన్న మాట...." అనుకుంది నిర్మల. ఆమె నమ్మలేకుండా వుంది. నమ్మకుండా వుండలేకుండా వుంది.

ఆ రాత్రి నిర్మలకి నిద్రరాలేదు. ప్రశాంతంగా నిద్రపోతూన్న భర్తనిచూస్తూ ఆలోచిస్తోంది." తనని అందరూ ఎంతో అదృష్టవంతురాలంటారు. కానీ, తనకి ఏదో అసంతృప్తి! "జీవితం యింతేనా.... నేనేం చేస్తున్నాను? ఏం తెల్సుకున్నాను!" అన్న భావం వదలదు. ఒకవేళ ఈ రకంగా ఆలోచించి, నిర్లిప్తంగా వుండటానికి కారణం....ఆనాటి సంఘటనా, రాజు మాటలూ కాదుకదా!...." నిర్మల ఆలోచనలు, పదిహేనేళ్ళు వెనక్కి వెళ్ళాయి. "ఎంత అమాయకమైన రోజులవి: పసితనం వదలి యవ్వనంలో అడుగు పెట్టింది తను. లేత మనసులలోవుండేది నిష్కల్మషత్వము. పవిత్రతయే. తన చుట్టూవున్న వాతావరణంలోను.మనుష్యలలోను ప్రతిబింబించి ప్రపంచమంతా పవిత్రంగా, ప్రేమమయంగా ఆనందలహరిలా అన్పించేది. హృదయంనిండా అనురాగాన్ని నింపుకుని, తానెప్పుడూ చూడని, తన సర్వస్వం కాబోయే ఆ వ్యక్తిని గురించి ఆలోచిస్తూ ఏదో పవిత్ర భావంతో, భక్తి. అనురాగాలతో. తనని, తన సర్వస్వాన్ని, అతని కర్పించి అతనిలో ఐక్యమైపోవాలన్న ఆ కోరిక. ఆ తపన తల్చుకుంటే వింత అనుభూతి కల్గుతుంది.

"రాజు....ఎంత! అందంగా నవ్వుతాడు అనుకుంది తాను. అతని స్నేహపూరితమైన స్వరమూ, నిర్మలమైన ఆ నవ్వులకి తన మనసు పులకరించింది. తానెప్పుడు లేచి నిలబడిందో, కానీ, చాలాసేపు అతని కళ్ళలో దేనికోసమో వెదుకుతూ అలాగే వుండిపోయింది. తరువాత గ్రహించింది. రాజు, కూర్చుని వున్నాడనీ, తాను అతని పాదాలవద్ద చతికిలబడి వుందనీ! రాజు కాలేజీలో జరిగిన ఏదో సంఘటన చెప్పి పకపకా నవ్వుతున్నాడు. తానూ నవ్వుతోంది. కానీ, రాజు మాటలకి కాదు. తన దేముడు ప్రత్యక్షమైనందుకు! తన రాజుని తాను గుర్తించి, కనుక్కున్నందుకు.

తనకి నవ్వు, యిన్నాళ్ళూ కనుక్కోనందుకు ఏడుపు ఒకేసారి కలాయి.

రాజువైపే, విస్ఫారిత నేత్రాలం చూస్తూ, కనుకొలుకులలో నీరు చేరగా, పెదవులపై చిరునవ్వురాగా, యిలా అనుకుంది తను: "ఎంత అందంగా వుంటాడు రాజు! బంగారు రంగు దేహచ్ఛాయ విశాలమైన ఛాతీ, విశాలమైన నుదురు.... మేధాశక్తికి నిదర్శనం! ఎప్పుడూ పలకరించినా నవ్వుతున్నట్లుండే కళ్ళు. స్నేహపూర్వకంగా, మృదుమధురంగా మాట్లాడే పెదవులూ, రాజు....ఎంతో విజ్ఞానంకల్గి. ఏవేవో జీవిత సత్యాలు, రహస్యాలూ తెలుసుకున్నట్లుంటాడు. ఈ రాజుని, తన రాజుని చేసుకుంటుంది తను! అవును. అతను తనకి కొత్తవాడుకాదు. అన్నయ్యకీ వదినకీ అతనిపై సదభిప్రాయం వుంది. ఎంత నమ్మకం లేకపోతే, యిష్టంలేకపోతే, వదిన, తను వూరు పల్లెటూరని, అతని చదువుకి ఆటంకం కలుగుకూడదనీ యీ వూరు తీసుకొచ్చి తమ యింటిదగ్గరగా గది యిప్పించి, అతని మంచిచెడ్డలు కనుక్కుంటోంది! వదిన తానడిగితే కాదనదు...."కలలలో తేలిపోతోంది తను.

"ఏమిటా పరధ్యానం? త్వరగా యిస్తే వెళ్తానింక, చదువుకోవాలి. రాజు భుజంమీద కొట్టి అన్నాడు. తాను వులిక్కిపడింది. ఆ స్పర్శ, తనకేదో, ఆనందాన్నిచ్చింది మనసులో కొంటెతనం ప్రవేశంచింది. అతని కళ్ళల్లోకి చిలిపిగా చూసి నవ్వుతూ "ఏం కావాలి రాజూ నీకూ.... అంది తను. రాజు, తనలో మార్పు కనిపెట్టినట్లున్నాడు, ఏదో విపరీతంగా చూస్తున్నవాడిలా తన చేతిలోని పుస్తకం, తీసుకుని, తల దించుకుని, వెళ్ళిపోయాడు మౌనంగా రాజుకి సాహిత్యం పైన మక్కువ ఎక్కువ. అతని విషయగ్రహణాశక్తికీ. జ్ఞాపకశక్తికి అందరూ ఆశ్చర్యపోతారు. ధన సంపద, గుణసంపద, గల ఆ సుందరాకారుడు తనభర్త అయితే...! అవును. అతనే నా సర్వస్వం కావాలి.... అన్నయ్యకి ఎలా చెప్పను? వదినతో అంటాను. నేనింక చదవదల్చుకోలేదని" ఆలోచిస్తూండిపోయింది తానా రోజు.

వారంరోజుల తరువాత, వదిన తనకి తల దువ్వుతోంది. అన్నయ్య, రాజు, చదరంగం ఆడుకుంటున్నారు. వీధిలో మల్లెపూలవాడి కేకవిని, వదిన పిలిచింది. "నాకొద్దు వదినా పూలు, నీ ఒక్కత్తికే కొను" అంది తను.

"పూలు వద్దనకూడదు" అంది వదిన రాజుకూడా వంతపాడుతూ అన్నాడు. అతను. "స్త్రీలు పరిశుభ్రమైన దుస్తులుకట్టుకుని, ముఖానికి బొట్టు, కాటుక, తలలో పూలతో కనబడితే ప్రపంచంలోవున్న పవిత్రత, నిర్మలత్వము, వారి ముఖాలలో వున్నటనిపిస్తుంది.అటువంటిస్త్రీలలో లక్ష్మీ సరస్వతీకూడా కనబడతారు నా కళ్ళకి" అని! ఆనాటినించీ, రోజూ కళ్ళకి కాటుక దిద్దుకునేది తను.

పూలుపెట్టుకోకపోయినా, కట్టడం సరదా తనకు. డాబామీద కూర్చొని పూలు మాల కడుతూ, హనిరాగం తీస్తూండగా, ఎవరో మెట్లెక్కి వస్తున్న సవ్వడి అయింది. 'అవి రాజు అడుగులు' అని గుర్తించగానే తన హృదయం ఝల్లుమంది. 'ఈ పూల మాలని రాజుకిస్తే, ఏంచేస్తాడతను? నా తలలో .... ఉహూం అలాంటిదానికి ఒప్పుకోడు తను....' అనుకుంటుండగా, రాజు తనని సమీపించేశాడు.

'జాజుల పరిమళం, వీధి చివరిదాకా వస్తోంది.' అంటూ, పళ్ళెంలోంచి రెండు పూలు తీసుకుని, ఆఘ్రాణిస్తూ నిలబడ్డ రాజుని చూస్తూ,తను పరిసరాలనీ సభ్యతనీ మరచిపోయింది. కట్టిన మాలను అతని పైకి విసిరేసింది రాజు మాలని బంతిలా అందుకుని, కుర్చీలో కూర్చున్నాడు ఆఘ్రాణిస్తూ రాజు, తదేకంగా తనపాదాల వైపే చూస్తుండటం గమనించి అడిగింది తను. "ఏమిటలా చూస్తావ్!"అని

"నీపాదాలు ఎంతకోమలంగా వున్నాయోనని చూస్తున్నాను. నీ పాదాలకి, పారాణీ, వెండి మువ్వల పట్టాలూ ఎంతో శోభనిస్తాయి నిర్మలా...." రాజు కంఠంలో ఉద్వేగం గ్రహించింది తను రాజుచేయి. హఠాత్తుగా తన పాదాలని స్పృశించటంతో తనలో గగుర్పాటు, కంగారూ కల్గాయి.

"అరె, అదేమిటి రాజూ...."అంటూ తను వెనక్కి జరిగింది.

"తప్పేముంది....నువ్వు నా దేవతవి. నిన్ను పూజించి తరించాలనివుంది" అన్నాడు రాజు. తన మనసుసంతోషంతో పొంగింది. రాజుని అక్కడే వదిలేసి గబగబా క్రిందికి దిగి వచ్చేసింది తను. "రాజు తన మనసు విప్పి చెప్పాడు యీ రోజు! అవును రాజూ! నా దైవం కూడా నువ్వే....మనిద్దరమూ ఒకరికి ఒకరం.... మధురమైన వూహలలో తేలిపోయిందితను. అన్నయ్యకి, వదినకి చెప్పాలని తన మనసు త్వరపడసాగింది

రాజు దగ్గర పాఠాలు వింటూ, రాజుతో మాట్లాడుతూ, యిదివరకులా, నిర్వికారంగా వుండలేకపోయింది తను. అవకాశం చూసి, ఒకరోజు తాను చెప్పదల్చుకున్నదంతా తలవంచుకునిగబగబాచెప్పేసి అతని ఆనందాన్ని చూడాలని తల ఎత్తింది తను. కానీ, అతనిలో తనూహించిన ఉత్సాహం లేకపోవటమూ, కనుబొమలు, ముడిపడి వుండమూ చూసి తెల్లబోయింది తాను. ఇంక నిశ్శబ్దాన్ని భరించలేనట్లు, ఆతృతగా అంది. "చెప్పు రాజూ....నీకు సంతోషంగా లేదూ...." రాజు నుదిటిపై పట్టిన చమటని తుడుచుకుంటూ, బలవంతంగా నవ్వుతూ,

"అసంభవం నిర్మలా....నువ్వు పొరబడ్డావు" అన్నాడు.

"పొరబడ్డానా? నీకు మతి పోయిందా రాజూ...." అని అరవాలనిపించినా, తన నోరు పెగలలేదు. ఏమనుకున్నాడో, రాజు, తన దగ్గరగా నిలబడి, సన్నని స్వరంతో అన్నాడు "నిర్మలా.... నేను....నేను.... నిన్నెప్పుడూ ఆ ఉద్దేశ్యంతో చూడలేదు. తనలో దుఃఖంపొంగింది, ఎలాగో అంది. "పోనీ యీసంగతిచెప్పు రాజూ:నువ్వెవరినైనా ప్రేమించావా? లేకపోతే నీ కభ్యంతరందేనికీ"....రాజుతనమాటలు సహించలేనట్లు, వినకూడనిదేదో విన్నట్లు ముఖంపెట్టి, "నిర్మలా....నాకు స్త్రీలంటే గౌరవంవుంది. నేను అందరినీ....నిన్నూ మీ వదిననీ నాతల్లినీ ఒకే భావంతో చూస్తాను నేను నాజీవితంలో ఒక ముఖ్యమైన నియమం పెట్టుకున్నాను. నేను వివాహం చేసుకోదల్చుకోలేదు...."అనేసి, తేలికగా నిట్టూర్పు వదిలాడు రాజు. అతనేదో మాటమార్చి నవ్వుతూ అంటున్నా, తానక్కడ నిలబలేక వేగంగా మెట్లుదిగి క్రిందికెళ్ళిపోయింది. దిండులో తల దూర్చి వెక్కి-వెక్కి- ఏడ్చింది తాను

"అత్యంత ఆనందకరంగా వుండాల్సిన ఆ సమయం ఎంత దుఃఖాన్ని, బాధనీ

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

తెచ్చి పెట్టింది! "అవమానింపబడ్డాను. తృణీకరింపబడ్డాను" అన్నభావం తీవ్రంగాబాధించేది. రాజుకెదురుగా రావటం తగ్గించివేసింది తను. కానీ, అతనిగురించే ఆలోచించేది.

"రాజు నలుగురిలోనూ తిరుగుతూ నలుగురిలాగే వుంటూ, యిలాంటి విపరీతపు మనస్తత్వాన్ని ఎలా పెంపొందించుకున్నాడు? అతని నిర్ణయం ఎంత అసహజంగా వుంది? బహుశః ఎవరినో ప్రేమించి, తాను నొచ్చుకుంటుందని అలా అంటున్నాడేమో! ఏమైతేనేమి? తనకి ద్రోహం చేశాడు" అని ఏడిచేది మనసులోనే తను.

ఆ తరువాత ఏ మత గ్రంథం తీసినా, మహర్షులు, జ్ఞానులు చెప్పిన బోధలు చదివినా అవి తనకి అర్థవిహీనంగా, అసహజంగా అన్పించేవి. అవి చదివి తను వేళాకోళంగా వెటకారంగా నవ్వుకునేది. 'ప్రతి స్త్రీనీ మాతృమూర్తిలా భావించు. నీ భార్యనికూడా మాతృమూర్తివలె చూడు'ట! అయితే, యింక ఏ స్త్రీకీ వివాహం కాదు. కానక్కర్లేదు! అసలు భార్యని తల్లిలా చూసుకునేట్లయితే వివాహంచేసుకోవటం ఎందుకు? మనిషి కర్తవ్య మేమిటి?

సృష్టిలో, ప్రాణులన్నిటికీ తన జాతి నభివృద్ధి చేసుకోవటం అన్నది ప్రకృతి సిద్ధంగా పుట్టుకతో వచ్చిన బుద్ధి కదా! ఈ పండితులు, మహర్షులూచెప్పే విషయాలు ప్రకృతికీ సృష్టికీ ఆటంకం కల్గించేవిగా భగవంతుణ్ణి ప్రతిఘటించేవిగా వున్నాయి. మనుషులు జంతువులేకాదు. అల్పప్రాణులైన క్రిమి కీటకాలు, ఏకకణ జీవులు, ఆఖరికిమొక్కలు కూడా తమకి తెలీకుండానే ఈ చర్య కొనసాగిస్తున్నాయి. భగవంతుడు ఆ శక్తినీ, వాంఛనీ ఎందుకు పెట్టినట్టు? సుకుమారమైన సుగంధ పుష్పానికీ, పవిత్రమూ, నిర్మలమూ అయిన కన్నె మనసుకీ ఎంత పోలిక వుందీ! వికసించబోయే మొగ్గ "నేను వికసించనున్నాను, భగవంతుని పాదసన్నిధి చే.కుని ముక్తి పొందటానికై! నా యవ్వనం, సువాసన, మకరందమూ అన్నీ ఆ ప్రభువుకే అంకితం" అని అనుకుంటుంది కాబోలు! కానీ సృష్టికర్త నిర్ణయించినట్లు ఒకరోజు తనకి తెలీకుండానే తాను ఫలంగా మారిపోతున్నట్లు గ్రహిస్తుంది! అవును! పూలకి మనసు, కాళ్ళు, చేతులు, కదలిక లేనందున, భగవంతుడే స్వయంగా గాలిరూపంలోవచ్చి, పరాగ సంపర్కానికి తోడ్పడి ఆ పువ్వు తన జాతిని నభివృద్ధి చేసుకోవటంలో అన్ని ప్రాపంచిక ధర్మాలు నెరవేర్చుకునేలా


## బంపర్ దీపావళి ఆఫర్

ఆగస్టు 1978 బహుమతులు గెలిచినవారు : హరియమ కుమార్ సాహ భగాల్పూర్ మరియు తారాచంద్ జంజీర్ శికార్ (రాజ్) ఎంట్రీ ఫీజు లేదు

బహుమతులు : వాచ్, కెమెరా, టేప్‌రికార్డర్, రికార్డ్ ప్లేయర్ ప్రెషర్‌కుక్కర్ (మా అభీష్టంపై ఏదో ఒక బహుమతి.) కన్సొలేషన్ లేక మూడవ బహుమతి : సోని సూపర్ డీలక్స్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టర్ అమ్మకం ధర 135/-. ఇది అమ్మకం అభివృద్ధి పథకం.

| | | |
|---|---|---|
| 10 | 15 | 8 |
| 9 | 11 | 13 |
| 14 | 7 | 12 |

నిబంధనలు : 1. తెల్ల కాగితంపై నమూనాలో ఇవ్వబడిన రీతిగా గళ్ళు గీసి 8 నుండి 16 వరకుగల అంకెలను ఒకసారి మాత్రమే వాడి ఎటు కూడినా మొత్తం 36 రావలయును. 2. బహుమతి గెలిచినవారు పోస్టేజి, ప్యాకింగ్ మొదలగు ఫీజులు చెల్లించుటకు తెలియపర్చబడును. వివాదములు అలీఘర్ జ్యూరిస్ డిక్షన్‌లో మాత్రమే. ఎంట్రీలు హిందీ లేక సహాయమునకు 33 ఇంగ్లీషులో మాత్రమే పంపండి.

ఆఖరి పోస్టింగ్ తేదీ : 24-11-78

MAYUR TRADERS (AJS-33) ALIGARH-30






ORDER FORM ---- POST TODAY ----

*The Manager* AJP-5
*Springfield Agencies (Regd.), New Delhi-110018*
*Dear Sir,*
*Please send me One Springfield Supershot-77 Air Rifle on Rs. 20 - per month instalment alongwith all the documents for possession. As per your instalment system, I agree to pay the instalments regularly.*

NAME.............................. AGE......YEARS
ADDRESS..............................
P.O.............. PIN ☐☐☐☐☐☐ DIST..............
OCCUPATION.................. SIGN..............

FILL THIS FORM IN ENGLISH IN BLOCK LETTERS
DO NOT SEND ANY ADVANCE WITH THIS ORDER

ఫ్రెంచి
ఉచిత పోస్టలు ట్యూషన్ : 4 మాసముల సర్టిఫికెట్ కోర్సు. వివరములకు సొంత చిరునామా కలిగిన పోస్టలు కవరు పంపండి.
Principal
IMPERIAL INSTITUTES (PLF)
Doriwalan, Delhi-5.

డా॥ పి. వి. కె. రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్

వైద్యవిద్వాన్-వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, శీఘ్ర స్ఖలనము-శుక్లనష్టము, సుఖ రోగములకు మానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడా చికిత్స గలదు.
రావ్స్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700.

SUVARNA

RALLI-MIX Deluxe.

ఇండియాలో కెల్ల అత్యంత శక్తివంతమైన మోటారుగల
రాలిమిక్స్
డీలర్లు : స్టోనో ఏజన్
ఏలూరురోడ్డు, విజయవాడ-2

Suvarna

సహాయపడుతున్నాడు. ఆ భగవంతుడే, విచిత్రంగా, కన్నెపమనుసులో అనురాగాన్ని అర్పణాభావాన్ని సృష్టించాడు స్త్రీలో కల్గే ఈ అర్పణాభావము. మాతృత్వం పొందాలన్నతపనా, పురుషునిలో ఆవాంఛయివే సృష్టి నిరంతరంగా సాగిపోయేలా చేస్తున్నాయి. ఈ సహజ విషయాన్ని కాదని, విరక్తిగా గడపాలంటే ....ఎంత నిగ్రహము, దీక్ష అవసరం! తానంతటి తపస్విని కాగలదా!" అని ఆలోచిస్తుంటే తనలో ఏదో ఆవేదన కల్గేది. రాజు కారణజన్ముడేమో! మహాత్ముడు కానున్నాడేమో నేను అజ్ఞానురాలను. ఐహిక విషయాల మీద ఆసక్తి. మమకారము వుండబట్టే, తన ఆలోచనలు. పెళ్ళికి సుముఖంగా సాగుతున్నాయి. తనలో వివేకము ఆలోచనా పటిమ లేదు, తాను అల్పురాలు అని తన మనసు ఆక్రోశించేది. ఏ స్వామీజీ అయినా నాకు ఉపదేశం చేస్తే అనుకునేది. అది పదిహేనేళ్ళ క్రిందట. ఇప్పుడు....తానొక గృహిణి-సంసారజీవితము. బంధాలు, అనుబంధాలు, బాధ్యతలు, సుఖదుఃఖాలుచవిచూసింది. ఇప్పటికీ ఇంకా ఏదో తెల్సుకోవాలన్న ఆ తపనా, యీ అసంతృప్తి, చిన్ననాటి ఆ అనుభవంవల్లనేనేమో ననిపిస్తోంది యిప్పుడు.

'రాజు, యిప్పటికీ అలాగే వున్నాడు. ఎంత పేరు, ప్రతిభ సంపాదించాడో! రాజుని గురించి భర్తకి చెప్తే.... ఏమని చెప్పాలి....చెప్పటానికేముంది? రాజు ఉపన్యాసాలు రోజూ వింటాను. రాజుకి శిష్యురాలనై. అతనితో వెళ్ళిపోతే, ఏమో! రాజు ఒకవేళ దొంగ సన్యాసి అయితే.... అమ్మో తను యిహానికీ, పరానికీ కూడా చెడిపోదూ..' రాజుని గురించి ఆలోచిస్తూండగానే తెల్లవారింది నిర్మలకి. భర్తతో రాజు తన వూరి అబ్బాయనీ, చిన్నప్పటినించీ, అలాంటి ఉద్దేశ్యాలతోనే వుండేవాడని చెప్పింది నిర్మల.

అది "గీతాజ్ఞాన యజ్ఞ"కి ఆఖరిరోజు నిర్మల, డాక్టర్ రమాకాంత్ రోజూ వెళ్ళవస్తున్నారు. కానీ, నిర్మల ఎందుకో, అందరిలా స్వామీజీ కాళ్ళపైబడి ఆశీర్వాదం పొందలేకపోయింది. అసలు, అతనికి సమీపంలో వుండటానికీ, పలుకరించటానికీ మనసొప్పలేదు నిర్మలకి. దూరంనించే విని వచ్చేసేది. గీతా పఠనం జరుగుతున్న ప్రాంగణంలోనే ఆ మఠం తాలూకు మనుషులు రకరకాల పుస్తకాలు, మత గ్రంథాలు, భగవద్గీతపై వ్యాఖ్యానాలూ, మత ప్రవక్తల బోధలు, రాజు వ్రాసిన ఉపన్యాసాలు మొదలైనవిగల పుస్తకాలు అమ్ముతున్నారు. నిర్మల కొన్ని పుస్తకాలు కొనదల్చి, అవి చూస్తూ, వాటి కోసం అడుగుతూ అన్నికొట్లూ తిరిగింది. ఆఖరికి, కావల్సిన పుస్తకం దొరికి అమితంగా సంతోషించింది. అమ్ముతున్న ఆవిడకి డబ్బిచ్చి పుస్తకం అందుకుంటున్న నిర్మల, ఏదో అనుమానంకల్గి, మళ్ళీ, ఆవిడ ముఖంలోకి చూసింది. ఆశ్చర్యంగా ఏదో అడిగేలోగా, ఆవిడే అంది ''మీరు .... నువ్వు.... నిర్మలకదూ..' నిర్మలకీ అప్పటికే గుర్తొచ్చింది. ఆవిడ..ఆ అమ్మాయి లీల అని! 'లీల, రెండో పెళ్ళివాణ్ణి చేసుకోవటం యిష్టంలేక, యింట్లోంచి పారిపోయింది.. లేచిపోయింది ఎవరితోనో. ఇప్పుడు లీలని చూస్తూంటే నిర్మల ఆలోచనలు ఎక్కడెక్కడికో పోయాయి. "లీల, రాజు"- నిర్మలకి ఏదో అనుమానం. 'తన ఊహే నిజమా.... ఈ పరిసరాలలోనూ, మనుషులలోను, పవిత్రత లేదా....' నిర్మల భుజంపై లీల చేయివేసి అంది 'బాగున్నావా నిర్మలా? పిల్లలా ....' నిర్మల, అన్ని సంగతులు చెప్పి, 'నువ్వు యిక్కడ....' అంది సందేహంగా. లీల విరక్తిగా నవ్వుతూ, 'అవును, నిర్మలా, భగవంతుడు, రాజు రూపంలో నాకు నీడనిచ్చాడు' అంది. నిర్మలకి లీల ముఖంలో ఏదో అసంతృప్తి కనబడింది. వారిద్దరూ మాట్లాడుకుంటూండగా, బిలబిలమంటూ ముగ్గురుపిల్లలు లీలని చుట్టుముట్టారు. అమ్మా భజనవేళ అవుతోంది, స్వామీజీ పిలుస్తున్నారు" అంటూ. నిర్మల ఆ పిల్లల వంక పరీక్షగా దేనికోసమో వెదకుతున్నట్లు చూసింది. ఆమె మనసులో ఎన్నో అనుమానాలు. "వీళ్ళు నీ పిల్లలన్న మాట. ఎంతమంది పిల్లలు లీలా.."అంది మామూలు గొంతుతో. లీల ముఖంలో కలవరపాటు, కనిపెట్టకపోలేదు నిర్మల. మరు క్షణంలోనే, లీల ముఖం ప్రశాంతంగా పెట్టి. "అందరూ నాపిల్లలే నిర్మలా! నీ పిల్లలుకూడా నాపిల్లలే. రాజు ఆశ్రమంలో పిన్నా పెద్దా, వృద్ధులూ, అందరికీ నేను అమ్మని" అంది. నిర్మలకి ఆ మాటలెందుకో రుచించలేదు. ఆమె మనసు "చూడు నిర్మలా బాగా చూడు. ఆ పిల్లాడి కళ్ళు, అవి అచ్చం రాజు కళ్ళలాలేవూ. ఆ జుట్టూ, ఆ నడకా" అని అనుమానాలని రేపింది.

[45 వ పేజీ చూడండి]

## మృగతృష్ణ

[12వ పేజీ తరువాయి]

నిర్మల అనుకోకుండానే లీలతో "నీకు అభ్యంతరం లేకపోతే, మా యింటికి రాకూడదూ పిల్లల్ని తీసుకుని?" అంది. లీల వస్తానని ఎడ్రసు తీసుకుంది. "నీ ఆతిథ్యం కాదనను" అంటూ.

అన్నమాట నిలబెట్టుకుని వచ్చిన లీలని చూసి సంతోషించింది నిర్మల. ఆమె కోసం ప్రత్యేకంగా పిండివంటలతో వంట చేయించింది. లీల నిర్మల యింటినీ. సామాన్లనీ. పరీక్షగా చూస్తూండగా, టేబుల్‌మీద నిర్మల, భర్తా, పిల్లలూ కల్సి తీయించుకున్న ఫొటో పై దృష్టి పడింది. ఎంత ఆనందమయమైన జీవితం. అనురాగం, తృప్తి వెల్లివిరుస్తున్న కుటుంబం. నిర్మల జీవితం ధన్యమైంది అని ఆలోచిస్తున్న లీల మనసు ఒక వింత బాధతో కూడిన అనుభూతికి గురైంది. ఆమె మనసుని ఏదో బలహీనత ఆవరించింది. ఆమె నిర్మలతో మాట్లాడుతూనే మనోనేత్రంతో ఏదో ఊహా చిత్రాన్ని చూస్తూ దానిని గురించిన వ్యాఖ్యానం నిర్మలకి చెప్పింది. యిద్దరి మనసులూ తేలికయ్యాయి వేర్వేరు విధాలుగా!

ఆరాత్రి నిద్రపోయేముందు నిర్మల అనుకుంది. 'అబ్బ! యిన్నాళ్ళకి, నా హృదయంలో బరువు తీరింది. ప్రేమాభిమానాలనే చల్లనీ తీయని నీటితో నిండిన సరస్సులాంటి భర్త. హృదయాన్ని నిర్లక్ష్యం చేసి, భక్తి. ధ్యానము, యోగము, అన్న ఎండమావి వైపు పరుగెత్తాను! ఏం మిగిలింది! అలసట. మరింత దాహము తప్ప! ఆయన చెప్పిందే నిజం! కొన్ని పద్ధతులకీ. నీతి. నియమాలకీ, సిద్ధాంతాలకీ, ధర్మానికీ కట్టుబడి. సక్రమమైన మార్గంలో, విధులనీ బాధ్యతలనీ. నెరవేర్చటంలోనే తృప్తి. ముక్తీ లభిస్తాయంటారాయన' అనుకుంటూ, భర్తవైపు అనురాగంతో. మక్కువతో చూసింది నిర్మల. రమాకాంత్ చిలిపిగాచూసి నవ్వుతూ, "నిద్ర రావట్లంలేదు నిమ్మీ. ఏదీ నీ కిష్టమైన ఆ పాట. "మధురానగరిలో" పాడవూ" అన్నాడు. నిర్మల మనసులో యిప్పుడు కొత్త ఉత్సాహం నిండింది. భర్తపై ప్రేమ పొంగి పొరలింది. తన పాటకి తన్మయత్వం చెందిన రమాకాంత్ మనస్సులో తల దాచుకుంటూ నిర్మల మనసులోనే 'నన్ను క్షమించండి కాంత్! ఇంకనించీ నా ధ్యానము, తపస్సు అన్నీ మీరే....' అనుకుంది తృప్తిగా.

* * *

హైదరాబాదునుంచి మద్రాసు పోతున్న ఎక్స్‌ప్రెస్‌లో, ఫస్టు క్లాసు కంపార్టుమెంటులో పయనిస్తున్నారు రాజు, లీల, మరి యిద్దరు అనాథ బాలురూ. పిల్లలూ, రాజూ నిద్రపోతున్నారు. మనశ్శాంతిని కోల్పోయిన లీలకి నిద్ర రావటంలేదు. ప్రశాంతంగా నిద్రపోతున్న స్వామీజీని చూస్తున్న కొద్దీ ఆమెలో పాపం చేశానన్న భయం. పశ్చాత్తాపం బయలుదేరాయి. కన్నీళ్ళు జలజలా రాలాయి. ఎవరో వెక్కివెక్కి ఏడుస్తూండటం విని, మెలకువ వచ్చిన స్వామీజీ ఎదురుగా 'లీలామాయి' ఏడుస్తూండటం చూసి ఆశ్చర్యపోయారు. తన సేవకురాలు లీలామాయీని అలాచూసి సహించలేక పోయారు. "అమ్మా లీలా" లీల స్వామీజీచేయి తలమీద పడగానే వులిక్కిపడి కన్నీరు తుడుచుకుంది. స్వామీజీ లీలని గురించి అనుకుంటున్నారు "ఈమెకీ యింకా ఏదో పొందాలన్న ఆరాటము, ఆశ చావలేదు. కోర్కెలు జయించటం ఎంత కష్టం" అని.

లీల. స్వామీజీ ముఖంలో దైవత్వాన్ని. పవిత్రతనీ చూస్తూ తాను చేసిన పాపం తనలో దాచుకోలేక సహించుకుపోతూ ముఖాన్ని రెండు చేతులతో కప్పుకుని ఏడవసాగింది.

"చెప్తాను. చెప్పేస్తాను. స్వామీజీని క్షమించమని వేడుకుంటాను.... అని లీల యిలా చెప్పసాగింది. "నన్ను క్షమించండి స్వామీ....రాజూ నన్ను క్షమిస్తావు గదూ....నేను పాపాత్మురాలిని! పతనమైపోబోతున్న నన్ను రక్షించి. నాపవిత్రతనీ. శీలాన్ని కాపాడి.నాజీవితం భద్రంగా. ప్రశాంతంగా గడిచిపోయేలా మార్గం చూపించిన నీకు నేను ద్రోహం చేశాను రాజూ! నేను.. నేను నీపై లేనిపోని అభాండాలువేసి నీకన్యాయం చేశాను. నాకు

## గాథావళి:

# అసలైన సమాజవాది

ఓ ఆశ్రమంలో ఓ గురువుగారు ఉంటున్నారు. సమాజవాదం (సోషలిజం) గురించి పరిపూర్ణంగా నేర్చుకోవాలని చాలామంది విద్యార్థులు గురువుగారి దగ్గరకు వెళ్ళారు. శిష్యులందరకు సమాజవాదం గురించి గురువుగారు బాగా బోధించారు. చదువు పూర్తయింది. పరీక్షరోజుకూడా వచ్చింది.



గురువుగారు ఓ శిష్యుణ్ణి పిలిచి యిలాఅడిగారు- "చూడు, బాబూ! నీ దగ్గర ఓ రొట్టె ఉందనుకో. ఆకలితో ఉన్న ఓ ముష్టివాడు నీ దగ్గరకు వచ్చి నిన్ను యాచిస్తాడు. అప్పుడు నీ వేమి చేస్తావ్?

శిష్యుడు కొంచెం ఆలోచించి యిలా సమాధానమిచ్చాడు - "గురుదేవా! నేనతనికి రొట్టె అంతా యిచ్చేస్తాను." గురువు గంభీరంగా "ఊఁ" అని రెండో శిష్యుణ్ణి పిలిచి అదే ప్రశ్న వేశారు.

ఆ శిష్యుడిలా సమాధానమిచ్చాడు "గురుదేవా! నేనతనికి సగం రొట్టె యిస్తాను.

గురువుగారు మరల గంభీరంగా "ఊఁ" అని మూడో శిష్యుణ్ణి పిలిచి అదే ప్రశ్న వేశారు.

శిష్యుడు వెంటనే "గురుదేవా! నేనతనికి రొట్టెయివ్వనండీ." అని సమాధానమిచ్చాడు. గురువుగారు చిరునవ్వునవ్వి ఆఖరు శిష్యుణ్ణి పిలిచి మరల అదే ప్రశ్న అడిగారు.

చాలా వినయంగా శిష్యుడు చెప్పాడు–"గురువర్యా! నేనతనికి రొట్టెయిస్తానని అభయ మిస్తాను."

గురువుగారు మహదానందంతో శిష్యుణ్ణి కౌగలించుకొన్నారు.

మూలం : బసంత్‌కుమార్ మింజ్

అనువాదం : కాలిపు కూర్మావతారం

నరక మేగతి! కృతఘ్ను రాలినిరాజూ నన్ను శపించు! శిక్షించు!" రోదించ సాగింది లీల.

స్వామీజీ ముఖంలో అదే చిరునవ్వు, అదే ప్రశాంతత.

"నా కన్యాయ మేమిటమ్మా లీలా చెప్పు ఏం జరిగింది:"

"రాజూ నీకు నిర్మల గుర్తుందా. నిన్న నేను వాళ్లింటికి వెళ్ళాను. నిర్మల ఐశ్వ ర్యాన్నీ, తృప్తినీ, ఆనందాన్ని చూస్తూంటే నాలో ఏవో యీర్ష్యాసూయలు రేగాయి. మూర్ఖపు పొరలు కమ్మాయి నా మెదడుకి. నిర్మల ఒకనాడు నిన్ను ప్రేమించిందన్న విషయం నాకు తెలుసు రాజూ. ఆమెకిప్పుడు నాపై ఈర్ష్య కలిగించాలనీ, అసంతృప్తి కలిగించాలనీ నాలో దురుద్దేశం కలిగింది, రాజూ....ఆ ఆవేశంలో నీపై అబద్ధం చెప్పానురాజూ! నువ్వు నన్ను ప్రాణాధికంగా ప్రేమిస్తావనీ, వాంఛిస్తావనీ నీద్వారా నేను అబ్బాయిని కని మాతృత్వం వహించాననీ నిర్మలకి చెప్పాను రాజూ! ఆ క్షణంలో వివేకం కోల్పోయాను. ధర్మంగానో, అధర్మంగానో తల్లికావటమే జీవితంలో స్త్రీకి ధ్యేయమనిపించింది.

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

మా చికిత్సవల్ల తెల్లమచ్చలు గల వారికి పూర్తిగా నయం అవడం ద్వారా మా వైద్యం మంచి కీర్తిని పొందింది. ప్రచారం నిమిత్తం ఒక ప్యాకెట్టు మందు ఉచితంగా ఇవ్వబడును. మొదటి కోర్సుతోనే మచ్చల రంగు మారడం ఆరంభమవుతుంది. జబ్బు వివరాలు వ్రాయండి.

GAUTAM CHIKITSALAYA
(S.DD)
P.O. KATRI SARAI (GAYA)




నిర్మల, నేనింకా, కన్యగా, వ్యర్థజీవితమే గడుపుతున్నట్లు గురించకూడదని తల్లిగా పరిపూర్ణతనొందాననుకోవాలనీ. నాలో దురాశ బయలుదేరింది. కాని, నేనిప్పుడు ఎంత అపచారం, స్వామిద్రోహం చేశానో తెలుస్తోంది. నన్ను శిక్షించు స్వామీ-నన్ను శపించు." వెక్కి వెక్కి ఏడ్చింది లీల. లీల మాటలు విన్న రాజులో ఏమి మార్పు లేదు. అదే చిరునవ్వు. అదే ప్రశాంతత అంతేకాదు- అతని కళ్ళల్లో ఏదో మెరుపు! ప్రేమగా లీల తల నిమురుతూ అన్నాడు. "ఊరుకో లీలా! వూరుకోమ్మా! తల్లి కాలేదన్న నీ తపన నేనర్థం చేసుకోగలను! విచారించకు లీలా...."

"రాజూ నీలో యింత క్షమా గుణం ఎక్కడిది రాజూ! నీకు అపకీర్తిని తెచ్చిన నాపై క్రోధం కలగటంలేదూ? నన్ను శపించి, నశింపజేయాలనిపించటంలేదూ? నన్ను తిట్టవేం రాజూ....నన్ను శిక్షించు..' లీల సిగ్గు, లజ్జతో తల ఎత్తలేకుండా వుంది.

"లేదు లీలా....లేదు..నాకు ప్రజలేమనుకుంటారోనన్న భయము, బాధల్లేవు. నేను సర్వసంగపరిత్యాగిని నాకెవరి అభిప్రాయము, అభిమానముతో సంబంధంలేదు. మనిషికి కావలసినది ఆంతరంగిక పారిశుధ్యం! నువ్వు క్షణికంగా అసూయకి లోనై పొరపాటు చేసినా, నీ తప్పు తెలుసుకుని పశ్చాత్తాపపడ్డావు. పాప నివేదన చేసుకున్నావు. నీ కింక పాపం అంటదు, విచారించకమ్మా...." అన్నారు స్వామీజీ.

లీల మనసులో తిరిగి ప్రశాంతత ప్రవేశించింది. చిరునవ్వుతో అభయ హస్తంతో నిలబడ్డ రాజుని చూస్తూ మనసులోనే అనుకుంది లీల, నువ్వు మామూలు మనిషివికాదు రాజూ! మహాత్ముడివి! కామ, క్రోధాలనుజయించిన మహర్షివి" అని రాజు పవిత్రత, నిగ్రహశక్తులను నెమరువేసుకుంటూ. నిద్రలోకి జారిపోయింది లీలామాయి.

కానీ, స్వామీజీ రాజుకి మాత్రం యిప్పుడు నిద్ర రావటంలేదు. ఆయన మనసుకూడా ఏదో వెర్రి సంతోషానికి, వింత తృప్తికి గురికావటం గమనించి వేదాంతిలా, విరాగిలా నవ్వుకుని యిలా అనుకోసాగారు. 'మనిషి మనసు ఎంత విచిత్రమైనది! నువ్వెంత అమాయకురాలివమ్మా లీలా! నన్ను మహర్షిగా, మహాత్మునిగా భావిస్తున్నావు కాని, నీకు నా ఆంతర్యం, నారహస్యం తెలిసిన రోజు, నీకు నాపై ఈ భక్తి గౌరవాలు, సానుభూతి వుంటాయా? జ్ఞానదాహంతో నాలుక పిడుచకట్టుకుపోయి నన్నొక జ్ఞానవాహినిగా పొరబడి, నా వైపు పరుగెత్తుకొస్తున్నావు! కానీ నువు చూస్తున్నది ఒక ఎండమావి అని నీకు తెలీదు. నీకేమని చెప్పను లీలా నా ఆంతర్యం! ఎన్నో గ్రంథాలు చదివాను. ఎంతోమందికి ఆదర్శ గురువుగా, స్వామీజీగా మారాను. ఎంతో మందికి ఆత్మ సంతృప్తినీ, మనశ్శాంతినీ ప్రసాదించాను. కానీ, నాకేదీ తృప్తి! నాకేదీ మనశ్శాంతి! లీలా, నువ్వు నాపై అబద్ధం చెప్పినా, నేను నిన్ను క్షమించానంటే నేను క్రోధాన్ని జయించిన మహా పురుషుణ్ణనుకుంటున్నావు. కానీ, లీలా నేను మామూలు పురుషుణ్ణి కూడా కాదని నీకు తెలీదు. నీతో పదిహేనేళ్ళనుంచీ కల్సివుంటూ కూడా నీ పవిత్రతకి భంగం కల్గించనందుకు నన్ను కామాన్ని జయించిన మహర్షి ననుకున్నావు, యోగి ననుకున్నావు, కానీ లీలా నేనెవరినో నీకు ఏమని చెప్పను? నువ్వు నాపై అబద్ధం చెప్పినా నాకెందుకు కోపం రాలేదో, నిన్నెందుకు క్షమించానో నీకు నోరుతెరిచి చెప్పలేనివాణ్ణి. ఈ విషయంలో నువ్వే నయం. చేసిన పాపం చెప్పుకున్నావు.

నిర్మల దృష్టిలో "తల్లివనిపించుకోవటం నీ కెలాంటి తృప్తినీ, ఆనందాన్నీ యిచ్చిందో నాకూ అలాగే మామూలు పురుషుణ్ణి "మగవాడిని" అన్పించుకున్నాను నీద్వారానని తెలిసనప్పుడు అంతే తృప్తినీ, ఆనందాన్ని అనుభవించానని నీకెలా చెప్పను లీలా! నాకో క్రోధం కలుగనిది యీ స్వార్థంతోనే! నేను గురువుగా, స్వామీజీగా పొందిన కీర్తి, దానివల్ల కల్గిన తృప్తికన్నా, నేను, మనస్ఫూర్తిగా ప్రేమించిన నిర్మలచే సంపూర్ణ పురుషునిగా, ఒక బిడ్డకు తండ్రిగా, కామాంధునిగా భావింపబడటంలో, ఎక్కువ తృప్తినీ, సంతోషాన్ని పొందుతున్నానీరోజు! కారణం..నేను.. నేను.. మగవానిగా అసమర్థుణ్ణికావటమే.. అది నా దురదృష్టం! చూశావా. లీలా మనిషి ఆంతర్యం ఎవరూ కనిపెట్టలేరు. మన నమ్మకాలు, విశ్వాసాలూ అన్నీ ఎండమావులే! నేను స్వామీజీని, సర్వసంగ పరిత్యాగినీ, యోగినీకాదు. ప్రాపంచిక సుఖాలకోసం, శారీరక అనుభవం కోసం తపించిపోతున్న అధముణ్ణి! ప్రజలు ఎంత అమాయకులు! నన్ను విజ్ఞాన వాహినిగా భావించి జ్ఞానసముపార్జనా

దాహంతో పరిగెత్తుకొస్తున్నారు. కానీ. నేనొక ఎండమావిని! ఎంత విచిత్రమో చూడు. నా బ్రతుకు! ప్రాణాధికంగా ప్రేమించిన నిర్మలం ఆమె మహాకలా, నన్ను.... ఒక కామ విషవాహినిగా భావిస్తూ వుండి వుంటుంది. కానీ. లీలా మీకే కాదు ఆమెకి కూడా తెలీదు. నేను ఏ స్త్రీకీ తల్లి కావాలన్న దాహాన్ని తీర్చి, సంతృప్తి పడుచగల్గే శక్తిని లోపించి వున్నానని! అదే నా రహస్యం లీలా. ఈ రహస్యం నాతోబాటే పోవాలి. అది బయటపడితే నా "అహం" దెబ్బ తింటుంది. అందుకే.. అందుకే మీఅందరి పట్లా యిలా మిగిలిపోయాను. కేవలం ఎండమావి అదే మృగతృష్ణగా....."


దీని తెలుపుచేసే శక్తిని మీకు మీరే ఋజువు చేసుకోండి:

# సూపర్ రిన్‌తో తళతళలాడే తెలుపు మరే ఇతర డిటర్జంట్ బిళ్ల లేదా బార్ కంటే తెలుపు







ప్రతిసారీ క్రమం తప్పకుండా సూపర్ రిన్ వాడి మీ బట్టలు మరింత తెల్లగా ఎలా అవుతాయో చూడండి. మరే ఇతర డిటర్జంట్ బిళ్ల లేదా బార్ కంటే ఎంతో తెల్లగా ఉతుకుతుంది సూపర్ రిన్. ఎందుకంటే, సూపర్ రిన్‌లో ఉంది ఉత్తమమైన తెలుపుచేసే శక్తి. దీని తెలుపు చేసే శక్తిని మీకు మీరే ఋజువు చేసుకోండి.




## మరే ఇతర డిటర్జంట్ బిళ్ళ లేదా బార్ కంటె మరింత తెలుపు చేసే శక్తి

హిందూస్తాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పాదన.

లింటాస్–RIN. 34-203 TL(AR)